
# వేలుపునింపిన బేరం

'మిత్ర'




ఆఫీసు "పీక్ అవర్స్" లో వుండగా—

"నమస్కారం సార్" అన్న మాటలు వినిపించాయి.

వ్రాస్తున్న ఫైలు లోంచి తల పైకెత్తి చూసాను.

ఓ యువకుడు వినయంగా నిలబడి వున్నాడు.

చిరునవ్వుతో తల ఆడించాను.

"ముకుందంగారు పంపించారు" అంటూ చేతిలో వున్న ఫైలు లాంటిది తెరిచి అందులోంచి ఓ కవరు తీసి నాకు అందించాడు.

కవరు మీద నా అడ్రసు వ్రాసి వుంది.

ఆఫీసు పని మీద రోజూ అనేక మంది వస్తూ వుంటారు. కవరు చించి లోపలి లెటరు తీసి చదవసాగాను.

'ఈ వుత్తరం తెచ్చిన వ్యక్తి మా బంధు వర్గంలోని వాడు. అతను ఉద్యోగం కొరకు ప్రయత్నిస్తున్నాడు, నీకు వీలు అయినంత సహాయం చేయగలవు" అన్నది అందులోని సారాంశం.

ముకుందం నా బాల్య మిత్రుడు.

దాదాపు ఇరవై ఏళ్ల క్రితం హైస్కూలులో కలిసి చదువుకున్నాము. హైస్కూలు చదువు అయిపోయిం తరువాత అతను వున్న వూళ్లోనే స్వంత ఆస్థి చూసుకో సాగాడు. ఇక నేను మాత్రం తిండికి కూడా గడిచే ఆధారం లేక పొట్ట చేత పట్టుకుని, అనేక వూళ్లు తిరిగాను.

జీవితంలో కిందపడి మీద పడి చివరికి ఈనాడు హైదరాబాదులో స్థిరపడ్డాను.

అయితే ఈ మధ్య కాలంలో ఎక్కువగా ముకుందం గురించి తెలిసింది లేకపోయినా, కిందటి సంవత్సరం విజయవాడ బస్సు స్టాండులో అనుకోకుండా కలిసాడు.

యోగ క్షేమాలు అయిం తరువాత అతని బలవంతంపై వాళ్ల వూరు వెళ్లటం జరిగింది.

ముకుందం విపరీతంగా ఆస్తి సంపాదించాడు.

చెరుకు తోటలు, పసుపు పొలాలు, కోళ్లఫారం, ఓ మాదిరి డైరి ఫారం, ఇవన్నీ చాలవన్నట్టు ఊళ్లో పంచాయితీ ప్రెసిడెంటు పదవి, సహకార పరపతి బ్యాంకుకి శక్రటరీ.

అంతా చూసి నేను కొయ్యబారిపోయాను.

అప్పట్లో స్కూలు చదువులో ముకుందం మహా డల్‌గా వుండేవాడు. కాని

సామాన్యమైన చదువుతో వున్న వూళ్లో అంత ఆస్తి సంపాదించటం తేలిక కాదు.

అయితే అంత పలుకుబడి, ఆస్తి కల ముకుందం ఈ వ్యక్తికి తనున్న పరిధిలో వుద్యోగం చూపెట్టలేక పోయాడా? ఏమో!

ఏది ఏమైనా—బాల్యస్నేహితుడు మొగటిసారిగా కోరిన కోరిక తీర్చటం నా బాధ్యత అనిపించింది. అందునా నా కున్న అధికారాలకి అదొక కష్టమైన పని కాదు.

"నీ పేరు ఏమిటి బాబూ" అన్నాను.

"రాజు"

"రాజూ! ఇప్పుడు నేను చాలా బిజీగా వున్నాను, సాయంత్రం ఆరుగంటలకు మా ఇంటికి వస్తే నీ గురించి ఆలోచిస్తాను" అని మా ఇంటి అడ్రెసు వ్రాసి ఇచ్చాను.

* * *

సరిగ్గా సాయంత్రం ఆరుగంటలకు రాజు మా ఇంటికి వచ్చాడు.

ఉదయం ఆఫీసులో గమనించలేదు కానీ, మనిషి పుష్టిగా, ఆరోగ్యంగా వున్నాడు. అంతకంటె ఎక్కువగా, నీటుగా డ్రస్ చేసుకున్నాడు. మొహంలో చిరునవ్వు, యువకులలో వుండే సహజమైన వుత్సాహం, ఆత్మవిశ్వాసంతో ముచ్చటగా వున్నాడు.

కానీ నిరుద్యోగిలో వుండే నిరాశ, నిస్పృహలు కనపడలేదు.

"అన్నట్లు నువ్వు ఎంతవరకు చదివావు" అన్నాను అతనివంక అభిమానంగా చూస్తూ.

ఎంతైనా అతను ముకుందం పంపిన వ్యక్తి కదా.

"బి. యస్. సి. పాసు అయ్యాను."

బి. ఎస్. సి. చదివిన అభ్యర్థికి తగిన ఉద్యోగం మా ఆఫీసులో రడీగా లేదు.

"చూడు రాజూ! నీ యోగ్యతలకు సరిపడిన వుద్యోగం ఈ క్షణంలో ఖాళీగాలేదు. కొన్నాళ్ళు నువ్వు వెయిట్ చెయ్యాల్సి వుంటుంది" అన్నాను సాధ్యమైనంత సానునయంగా.

వుద్యోగం కోసం ఎన్నో ఆశలు పెట్టుకుని వచ్చినందుకు ఇంకా కొన్నాళ్ళు వెయిట్ చెయ్యమంటే ఎంత నిరాశ పడతాడో! అని సంకోచించాను.

కానీ-

"ఎన్నాళ్లుండమన్నా వుంటాను సార్. వుద్యోగం దొరికేవరకూ ఇంటికి వెళ్ళవద్దు అని నిర్ణయించుకున్నాను" అన్నాడు దృఢనిశ్చయంగా.

వుద్యోగం దొరికే వరకూ మా ఇంటిలో వుంటానంటాడేమోనని సందేహించాను. అంత వసతి సౌకర్యం లేదు

"అసలు నువ్వు ఎక్కడ దిగావు" అన్నాను, ఏ బంధువుల ఇంటిలోనో దిగి వుంటాడని వూహిస్తూ.

"నాంపల్లిలో హోటల్ "సరస"లో దిగి రెండు రోజులు అయింది" అన్నాడు కాజువల్‌గా.

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను

వుద్యోగం కోసం వచ్చి హోటలులో దిగటమేమిటి?

అంత డబ్బు వుందా?

ఉంటే ఈ ఉద్యోగ మెందుకు?

నా మనసులో ఎన్నో సందేహాలు కలిగాయి.

"రాజా నీకు ముకుందంగారు ఎలా తెలుసు?"

"వారిదీ మాదీ ఒకే వూరు సార్" అన్నాడు రాజు

అదొక్కటే కారణం కాకపోవచ్చు. ఎందుకంటే— రాజుతోపాటు ఆ వూరిలో యింకా ఎంతోమంది నిరుద్యోగులుండి వుంటారు. వారందరిలో రాజునే నా వద్దకు పంపాడంటే ముకుందం ఆంతర్యంలో ఏదో వుందనిపించింది.

"ముకుందంగారు మీ గ్రామ సహకార బ్యాంకుకి సెక్రటరీ కదా. ఆయన నీకు ఆ వూళ్ళోనే వుద్యోగం చూపించలేకపోయారా" అన్నా. కూపీ లాగుతూ

"ఆ వూళ్ళో వుద్యోగం చేయాలనుకుంటే ముకుందంగారే అవసరం లేదు మా నాన్నగారు కూడా వుద్యోగం యిప్పించగలరు" అన్నాడు కొంచెం పౌరుషంగా.

అతని వింత ధోరణి నాకూ అర్థంకాలేదు.

"ఎలా?"

"ముకుందంగారు బ్యాంకుకి సెక్రటరీ అయితే, మా నాన్నగారు అదే బ్యాంకుకి ప్రెసిడెంటు"

"మరింకే.!"

"కానీ పల్లెటూరిలో చేసే వుద్యోగంలో ప్రెస్టీజ్ ఏముంటుంది సార్" అన్నాడు రాజా అదోలా ముఖం పెట్టి.

ఉద్యోగం చేయటం బతుకు తెరువుకోసం కానీ, ప్రెస్టేజీ కోసమా?

ఆకలితో అలమటించే వాడికి, బతుకు తెరువు దొరక్క జీవితం అనే సముద్రంలో కొట్టుకుపోయేవాడికి "ప్రిస్టేజి" అంటే ఏమిటో గుర్తుకు రాదు రాకూడదు

కానీ ఇతను ప్రిస్టేజ్ కోసం పాకులాడుతున్నాడంటే తిండి బట్టకు లోటులేని వాడు అయి వుండాలి


"అయితే మీరు అన్నదమ్ములు ఎంతమంది?"

"ఇద్దరం."

"నువ్వు పెద్దవాడివా?"

"కాదు రెండవ వాడిని"

"మీ అన్నయ్య ఏం చేస్తున్నాడు?"



డా॥ పి. వి. కె. రావు, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్.

వివాహము అయినదా వేయ నవసరము లేదు. హస్త ప్రయోగం, నరముల బల హీనత, శీఘ్రస్ఖలనములకు ఆయుర్వేద చికిత్స.
పోస్టు ద్వారా చికిత్స కలదు.
రావూస్ క్లినిక్,
సి. బి. రోడ్, తెనాలి,
ఫోన్: 700, 1010.







# కడుపు నిండిన బేరం

"వుయ్యూరులో బియ్యం వ్యాపారం చేస్తాడు"

"అతనికి పెళ్లి అయిందా?"

"అయ్యింది. మాకో అక్క వుంది, ఆవిడ పెళ్లి కూడా అయిపోయింది."

"మీకు వూళ్లో ఆస్తి పాస్తి ఉన్నాయా ?"

"పెద్దగా లేవు"

"ఏ మాత్రం వుంది ?"

"అయిదెకరాల పొలం వుంది"

అంటె కనీసం లక్ష రూపాయల స్థిరాస్తి: ఇతనికి కనీసం యాభై వేల రూపాయల వాటా వస్తుంది. అది కాక ఇంకా ఎంత ఆదాయం వుందో!

"మరి అంత పొలం, ఆస్తి వుండి, ఇలా వుద్యోగం కోసం పాకులాడటం ఎందుకు, వున్న వూళ్లో స్వంత ఆస్తి చూసుకో వచ్చుగా ?"

"కానీ నాకు ఇష్టంలేదు."

"కారణం ?"

"చదువు రాని వాళ్లు మా పొలంలో కూలీలుగా పని చేస్తున్నారు. అయితే ఇంత చదువు చదివి అదే పొలంలో వాళ్లతో పాటు నేను దిగితే నాకు, వాళ్లకి తేడా ఏముంది సార్."

"ఎందుకు లేదు. వాళ్లు పని వాళ్లు. నువ్వు యజమానివి. వాళ్లు కూలీలు. నువ్వు భూ కామందువి."

"ఎంత అయినా చెప్పండి సార్. పై వూళ్లో "క్లాస్"గా వుద్యోగం చేయటంలో గల హోదా — వున్న వూళ్లో రమ్మంటె రాదు."

అతనికి గల జబ్బు ఏమిటో మెల్లిగా నాకు బోధపడ సాగింది.

"అయితే నీకు వుద్యోగం వేయించినా ఆ జీతం డబ్బులు ఇంత పెద్ద నగరంలో చాలక పోవచ్చు" అన్నాను అతడ్ని నిరుత్సాహ పరుస్తూ.

"జీతం చాలకపోతే ఇంటి నుండి డబ్బు తెప్పించుకుంటాను" అన్నాడు రాజు తేలికగా, అదొక సమస్య కాదన్నట్టుగా.

నేటి యువతరంలో వుద్యోగం పట్ల పెరుగుతున్న ఈ మోజు చూసిన తరువాత, ఈ దేశంలో నిరుద్యోగ సమస్యకి పరిష్కారం లేదనిపించింది.

## జపాన్ స్త్రీలపై పాశ్చాత్య నాగరికత ప్రభావం!

ఎక్కువ మంది జపాను స్త్రీలు వంటింటి చెరనుండి బయట పడి సమాజంలో చురుకుగా పాల్గొంటున్నట్లు జపనీస్ ఇకనామిక్ ప్లానింగ్ ఏజన్సీ వారు ఒక శ్వేతపత్రంలో తెలియ చేశారు. వీరి ఆర్థిక పరిస్థితులు లేదా ఉన్నత విద్య దీనికి కారణం కావచ్చు. ఎక్కువమంది స్త్రీలు పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తున్నారు. పురుషులు కూడా ఇంటి బాధ్యతలను పంచుకో వలసిన ఆవశ్యకతను గుర్తిస్తున్నారు. మొత్తంమీద జపాను నాగరికత పాశ్చాత్య నాగరికతకు చేరువవుతున్నది.

వున్నవాడు కూడా వుద్యోగం కోసం ఎగబడితే లేనివాడు ఏమై పోవాలి?

ఆర్థిక స్థిరత్వం కలిగి, ఇంత తింటూ పదిమందికి ఇంత పెట్టగల స్థితిలో వున్న వాళ్లు కూడా ఈ రోజుల్లో వుద్యోగాలు కోసం ఆరాట పడితే పూటకి గతిలేక, దుర్భర దారిద్ర్యంలో ఆకలి చావులు చస్తున్న వేల కుటుంబాలకు మార్గం చూపేదెవ్వరు ?

వున్న వాడికి వుద్యోగం కల్పించటం లేని వాడి కడుపు కొట్టటమే అవుతుంది.

అన్నీ వున్నవాడు వచ్చే జీతం విలాసాలకు, వినోదం కోసం వెచ్చించి, దేశంలో ద్రవ్యోల్బణం పెరగటానికి ఒక కారణం అవుతుంటే— అదే సమయంలో మరో నిరుద్యోగికి జీవనాధారం దొరికే అవకాశం లేకుండా పోతూంది.

స్వతంత్రంగా బ్రతకగలిగిన వాడు వుద్యోగాల కోసం ఎగబడకుండా తన కాళ్ల మీద తను నిలబడి దేశంలో గల కోటి నిరుద్యోగులకి ఇంత ఆసరా చూపించాలి.

ఏ ఆధారం లేనివాడికి వుద్యోగం ఎలాగూ తప్పదు మరి.

అయితే ఇదంతా నేటి యువకులు ఎంత వరకు గ్రహిస్తున్నారు ? గ్రహించని వారికి చెపితే తెలుస్తుందా ?

"అందాక ఎందుకు ? ఈ రాజుకి నేను నచ్చ చెప్పగలనా" అన్న సందేహం వచ్చింది

అసలు రాజు లాంటి వాళ్లు దేశంలో ఇంకా ఎంత మంది వున్నారో—?

# కడుపు నిండిన బేరం

ఆలోచించగా రాజుకి వుద్యోగం వేయించ టంలో ఔచిత్యం లేదనిపించసాగింది.

అతని బదులు మరో పేదవాడికి దారి చూపితే అతనిమీద ఆధారపడిన ఓ కుటుంబం దరిచేరుతుంది.

అయితే రాజుకి వుద్యోగం వేయించక పోవటంతో నా బాధ్యత తీరిపోదు. నేను కాకపోతే మరొకరిని ఆశ్రయించి వుద్యోగం సంపాదించ వచ్చు.

కాబట్టి అసలు అతనిలో గల ఈ ధోరణి మార్చాలి.

అందుకు నోటి మాటలు పని చెయ్యవు.

ఓ పథకం తయారు చెయ్యాలి— అని నిర్ణయించుకున్నాను.

"రాజా! రెండు రోజులు తరువాత కనపడు — నీకు తప్పకుండా వుద్యోగం వేయిస్తాను'' అన్నాను.

అతను సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

* * *

రెండు రోజులలో రాజుకి మా కంపెనీలో దిన భత్యం మీద "రోజు కూలీ" వుద్యోగం వేయించాను. కావాలనుకుంటే అంతకంటె మంచి వుద్యోగం వేయించగలను.

అదే "రోజు కూలీ" పనిలో రాజుతో సమానంగా చదివిన వాళ్ళు, ఇంకా పై చదువు చదివిన వారు కూడా వున్నారు.

అయితే వీళ్ళందరి పనిపై అజమాయిషీ చేసే వ్యక్తి మాత్రం నిరక్షరాస్యుడు.

నిరుద్యోగ సమస్యలో చిక్కుకుపోయి; బ్రతుకు తెరువు కానరాక తన కోసం కాకపోయినా, తన మీద ఆధారపడిన వారి కోసం, ఇంత సంపాదించ వలసిన అగత్యం ఏర్పడగా, మిగలిన వారంతా ఆ "రోజుకూలీ" వుద్యోగం మహా ప్రసాదంగా స్వీకరించి, నిర్విరామంగా రోజులు దొర్లించుకు పోతుండగా, రాజు మాత్రం ఆ పరిస్థితులలో ఇమడలేక పోయాడు.

వారం రోజులకే రాజుకి వుద్యోగం మీద గల మోజు తీరిపోయింది.

"సార్! ఇక్కడ ఈ వుద్యోగం కంటె, మా వూళ్ళో పొలం పని చేసుకోవటం మెరుగు. వస్తాను సార్'' అంటూ రాజు సెలవు తీసుకున్నాడు.




కథ-స్క్రీన్‌ప్లే దాసరి నారాయణరావు

దర్శకత్వం దుర్గా నాగేశ్వరరావు

మణియన్ ఫిలింస్

సీతాలు

కలర్

నిర్మాతలు: మణియన్, విద్వాన్ లక్ష్మణన్

లిటిల్ బడ్స్ కాన్వెంట్ [ఇంగ్లీషు మీడియం]

సత్యనారాయణపురం, విజయవాడ-11

ఉత్తమ శిక్షణకు, ఉన్నత విద్యకు మీ పిల్లలను చేర్పించండి. అనుభవజ్ఞులైన ఆంగ్లో ఇండియన్ ఉపాధ్యాయినులచే అత్యుత్తమ శిక్షణ ఇవ్వబడును. L.K.G. నుండి 7వ తరగతివరకు ఆయాలు మరియు రిక్షా సౌకర్యములు కలవు. మేథమేటిక్స్ బోధించుటకు B.Sc. లేక B.Ed. ఉపాధ్యాయినులు కావలెను.

సెక్రటరి, M. సత్యనారాయణ, B.Sc.

ఉత్తమ బహుమతి

వివాహాది శుభకార్యాలకు, బహుమతి ఇచ్చేందుకు రుచికరమైన వంటకాలకు ప్రసిద్ధి చెందిన పుస్తకం

శ్రీమతి మాలతీ చందూర్

వంటలు - పిండి వంటలు రు. 20-00

అన్ని పుస్తకాల షాపులలోను దొరుకుతుంది లేదా ఒక రూపాయి తగ్గించి M.O. పంపినవారికి ఆ రూపాయికి V.P.P. పెట్టి పంపుతాము.

క్వాలిటీ పబ్లిషర్స్, రామమందిరంవీధి, విజయవాడ-2.




మీరు నిత్యంప్రేమించేసువాసన

లావణ్యా

బ్యూటీ టాల్కమ్ పౌడర్

SUVARNA

HIRUSAH ENTERPRISES

KANCHIPURAM-631 501